

రేపు 'స్పందన'

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 2: కర్నూలు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగే స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



భృంగి వాహనంపై శ్రీశైలేశుడు

- స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజా క్రతువులు
- ద్వారకా తిరుమల నుంచి పట్టువస్త్రాలు
- శ్రీగిరికి తరలి వస్తున్న భక్తులు
- నిండిపోతున్న వసతి కేంద్రాలు

శ్రీశైలం, మార్చి 2: ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైలం మహా క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండో రోజు నుంచి వాహన సేవలు, గ్రామోత్సవాలు మొదలయ్యాయి. అర్ధనారీశ్వర రూపానికి మూలకారకుడైన భృంగి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల సేవలో తరించారు. భృంగి వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులనుజేసి సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవార్లను క్షేత్ర పురవీధుల్లో విహరింపజేశారు. అశేష భక్తజనం ఈ అద్భుత ఘట్టాన్ని కనులారా వీక్షించి పరవశించారు. గ్రామోత్సవం ముంగిట కోలాటం, చెక్కభజన, వేషధారణలు, జాంజ్ పథక్, గోరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్ప డోలు, బంజార నృత్యం, తప్పెట్లు, శంఖానాదాలు, మంగళవాయిద్యాలతో కొనసాగింది. ఆలయ రాజగోపురం నుంచి గంగాధర మంటపము మీదుగా బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవ క్రతువు జరిగింది.



పట్టు వస్త్రాలను తెస్తున్న ప్రధాన అర్చకులు

రోజువారి క్రతువులు

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైలంలోని ఉభయ దేవాలయాలలో స్వామిఅమ్మవార్లకు ఉదయం నుంచి ప్రత్యేక పూజాక్రతువులు నిర్వహించారు. చండీశ్వర పూజ, జాపానుష్టానాలు, స్వామివారికి విశేష అర్చనలు, అమ్మవారికి నవవరణార్చనలు, రుద్ర, చండీ హోమాలను శాస్త్రోక్తంగా జరిపారు. సాయంకాలం అనుష్టానాలు, నిత్య వాహన కార్యక్రమాలను అర్చక, వేదపండితుల సమక్షంలో నిర్వహించారు.

స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం తరఫున ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి బాబురావు, ఉప ప్రధానార్చకులు కొండూరి జనార్దనాచార్యులు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆదివారం విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి అమ్మవార్ల దేవస్థానం తరఫున భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

శ్రీగిరికి తరలివస్తున్న భక్తులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీగిరికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన శనివారం నల్లమల అటవీ మార్గం మీదుగా కాలినడకన వచ్చే భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి శివస్వాములు తరలి రావడంతో శ్రీశైల క్షేత్రంలోని ప్రధాన వీధులన్నీ రద్దీగా దర్శనమిచ్చాయి. అలాగే క్షేత్రంలోని అన్నదాన సత్రాలు, వసతి కేంద్రాలు భక్తులతో కిక్కిరిశాయి. ప్రత్యేకించి స్వామిఅమ్మవార్ల దర్శనార్థం భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. అదే విధంగా ప్రసాద విక్రయ కేంద్రాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. అలాగే కళ్యాణకట్ట కేంద్రాల్లో భక్తులు అధిక సంఖ్యలో తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



మల్లన్నకు ఇరుముడి సమర్పించిన శివదీక్షాపరులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మండల, అర్ధమండల దీక్షను స్వీకరించిన శివస్వాములు శనివారం శ్రీశైలం మల్లన్నకు భక్తితో ఇరుముడులు సమర్పించారు. ముందుగా దేవస్థానం వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా శివస్వాములు ఇరుముడులతో స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం శివదీక్షా శిబిరాల్లో శాస్త్రోక్తంగా శివదీక్ష విరమించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఈ సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ దక్షిణ మాఢ వీధిలోని నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీ కళావేదిక, శివ దీక్షా శిబిరాల ప్రాంగణంలో నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం సంప్రదాయ నృత్య ప్రదర్శన, కూచిపూడి నృత్యప్రదర్శన, భరతనాట్యం, రామాంజనేయ యుద్ధం, భూకైలాసం నాటకం కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు హంస వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం స్వామి అమ్మవార్లు హంస వాహనంపై సేవలో ఊరేగనున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



పాతాళగంగలో స్నానాలు చేస్తున్న భక్తులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

రైతు వ్యతిరేకి బీజేపీ

- మోదీ ప్రభుత్వంలో లక్షల కోట్ల ఎగవేత
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 2: కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుంచి బీజేపీ రైతులకు వ్యతిరేకంగా పాలన సాగిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీని బలపరిచే పార్టీలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం ఉమ్మడి కర్నూలు జిల్లా సీపీఐ సర్వసభ్య సమావేశాన్ని నగరంలోని దేవి ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఫ్యాక్షనిజం రాజకీయం చేస్తోందన్నారు. కర్నూలు జిల్లా ఎందరో త్యాగపురుషులు లాంటి ఆణిముత్యాలను అందించిందన్నారు. పశ్చిమప్రాంతం నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతుంటే పట్టించుకునే ప్రభుత్వాలు లేవన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి సోమశిల వరకు సీపీఐ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేశామన్నారు. బీజేపీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా చేసిన నల్లచట్టాలను నిరసిస్తూ పోరాటం చేసి మెడలు వంచామన్నారు. మోదీ గ్రాఫ్ పడిపోవడంతో రామాలయాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వానికి టీడీపీ,వైసీపీ,జనసేన పార్టీలు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాయని ఆరోపించారు. దేశంలో మోదీ అనుచరులు 29 మంది వందలాది కోట్లు ఎగ్గొట్టి పోయారని వారిని ఏ మాత్రం శిక్షించడం లేదని అన్నారు. అందరి చేత పన్నులు వసూలు చేయించి ఏడుగురు గుజరాతీలను దత్తపుత్రులుగా చేసుకుని వారిని రక్షించి విదేశాలకు పారిపోయేటట్లు చేశారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వంలో అవినీతి హోల్‌సేల్ వ్యాపారంలా తయారైందన్నారు. ఈ సమావేశంలో నంద్యాల, కర్నూలు జిల్లాల కార్యదర్శులు ఎన్.రంగనాయుడు, బీగిడ్డయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కె.రామాంజనేయులు, రామచంద్రయ్య, ఆవుల శేఖర్, రైతు సంఘం నాయకులు కె.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎస్ఎన్.రసూల్, లలితమ్మ, గిడ్డమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

అప్పుల ఊబిలో రాష్ట్రం



జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. రానున్న ఎన్నికల్లో ప్రజల పక్షాన నిలబడాలి. దుర్మార్గమైన, స్వార్థపూరిత రాజకీయాలు చేసే మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి. మోదీ వచ్చాకానే దేశం ఆర్థికంగా వెనుకబడింది. ప్రజా పక్షాన నిలిచి ఎర్ర జెండా దేశాన్ని, రాష్ట్రాన్ని రక్షించే బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిత్యావసర ధరలు పెంచేస్తూ ప్రజలు ఏమీ గమనించడం లేదన్న భ్రమలో బీజేపీ ఉందన్నారు.

\- ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి

పోలియో చుక్కలు వేయించండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 2: ఐదేళ్ల లోపు పిల్లలకు ఆదివారం పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ జి.సృజన అన్నారు. కలెక్టరేట్ నుంచి మెడికల్ కాలేజీ వరకు నిర్వహించిన పల్స్ పోలియో ర్యాలీ కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఉదయం 7 గంటలకు మొదలై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రైల్వేస్టేషన్లు, బస్టాండ్లులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బూత్‌లలో ప్రజలు తప్పకుండా తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. హైరిస్క్ ప్రాంతాల్లో ఉన్న చిన్నారుల్లో ఏ ఒక్కరూ మిగిలిపోకుండా పోలియో చుక్కలు వేయాలని అన్నారు. ఇంటింటికి తిరిగి మిగిలిపోయిన చిన్నారులకు కూడా చుక్కల మందు వేయాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.బి.రామగిడ్డయ్య, డీఐవో డా.ప్రవీణ్ కుమార్, డీసీఎంవో డా.ఉమా, డీఈఎంవో ప్రమీలదేవి, డిప్యూటీ డీఈఎంఓ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 3.48 లక్షల మంది పిల్లలకు చుక్కలు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 2: ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధం చేసినట్లు కర్నూలు డీఎంహెచ్‌వో డా.బి.రామగిడ్డయ్య, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వై.ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వారు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో 3,48,071 మంది 5 సంవత్సరాలలోపు పిల్లలకు 1600 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. బస్టాండు, రైల్వేస్టేషన్లలో 52 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 3వ తేదీ బూత్ కేంద్రాల్లో, 4, 5 తేదీల్లో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని కర్నూలు డివిజన్‌కు డీఐవో ప్రవీణ్ కుమార్, పత్తికొండ డివిజన్‌కు జిల్లా టీబీ ఆఫీసర్ ఎల్.భాస్కర్, ఆదోని డివిజన్‌కు డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో డెమో ప్రమీలాదేవి, ఎస్‌వో హేమసుందరం, డీపీహెచ్‌న్‌వో ఇందిర, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెచ్‌ఈ పద్మావతి, ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ జి.సృజన



రుద్రవరం వద్ద కర్నూలు నగర వాసులకు ఇంటి పట్టాల కోసం 2020లో కొలతలు వేస్తున్న అధికారులు (ఫైల్)



కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మహిళలకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య, కర్నూలు వైసీపీ సమన్వయకర్త ఏఎండీ ఇంతియాజ్

అదే స్థలం.. అదే పట్టా!

పట్టాలు అవే..! స్థలం కూడా అదే.. పంపిణీ మాత్రం రెండు సార్లు..! మూడేళ్ల క్రితం 'నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు' పథకంలో భాగంగా పలువురికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. నగరానికి రెండు కిలో మీటర్ల దూరంలో పి.రుద్రవరం సమీపాన రాళ్లగుట్ట ప్రాంతంలో ఇచ్చే స్థలం వద్దంటూ ఒక్కరు కూడా ఇంటి నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. ఎవరి స్థలం ఏదో కూడా లబ్ధిదారులు చూడలేకపోయారు. రానున్న ఎన్నికల్లో ఓట్ల కోసం వైసీపీ ప్రజా ప్రతినిధులు, నేతలకు మళ్లీ పేదలు గుర్తుకొచ్చారు. అదే స్థలం.. అవే పట్టాలు.. వారే లబ్ధిదారులు.. కానీ ఈసారి మారింది వేదిక మాత్రమే. శనివారం నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పేదలకు ఇంటి పట్టాల పంపిణీ పేరిట అధికారులు హడావుడి చేశారు. ఎన్నికలవేళ వైసీపీ నాయకుల ప్రచారం కోసం రూ.లక్షల ప్రజాధనం విచ్చలవిడిగా ఖర్చు చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఎప్పుడో పట్టాలు ఇచ్చిన స్థలాలకు మళ్లీ పట్టాలు ఇస్తూ ఇటు అధికారులు.. అటు వైసీపీ నాయకులు అభాసుపాలవుతున్నారు.

- మూడేళ్ల కిత్రమే పి.రుద్రవరం సమీపంలో 'నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు' పట్టాలు పంపిణీ
- మళ్లీ వాటినే అందజేసిన అధికారులు
- అక్కడకు వెళ్లేందుకు ఆసక్తి చూపని పేదలు
- ఒక్క ఇల్లు కూడా కట్టలేని పరిస్థితి
- ఎన్నికల వేళ వైసీపీ డ్రామా
- సమావేశాల పేరిట విచ్చలవిడిగా ప్రజాధనం ఖర్చు

కర్నూలు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో 'నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు' పథకంలో భాగంగా 2020లో కర్నూలు నరగంలో 52 వార్డుల పరిధిలో సుమారు 10 వేల మంది లబ్ధిదారులను గుర్తించారు. సెంటు స్థలం ప్రకారం పట్టాలు ఇచ్చేందుకు కర్నూలు రూరల్ మండలం పి.రుద్రవరం సమీపంలో 400 ఎకరాలు గుర్తించారు. పేదలందరికి ఇంటి స్థలాలు పేరిట రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు అప్పట్లో ఎంతో ఆర్భాటంగా పట్టాలు పంపిణీ చేశారు. కనీసం సెంటు స్థలమైనా వచ్చిందని పేదలు అక్కడికి వెళ్లి చూస్తే.. రాళ్లు, గుట్టలు, ఏటవాలు ప్రాంతం కావడంతో ఇళ్లు కట్టుకోవడానికి ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం ముళ్ల పొదలతో నిండిపోయింది. గడిచిన మూడేళ్లల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఏ ఒక్కరూ పేదల ఇళ్ల పరిస్థితిని పట్టించుకోలేదు.

వైసీపీ ప్రచారానికి ప్రజా ధనమా..?

ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన పట్టాల పంపిణీ సమావేశాన్ని వైసీపీ ఎన్నికల ప్రచార సభగా మార్చేశారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని, జగన్‌ను మళ్లీ సీఎం చేయాలంటూ అధికారుల సాక్షిగా వైసీపీ నుంచి గెలుపొందిన ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. ఎమ్మెల్యేగా ఇంతియాజ్ అహ్మద్‌ను గెలిపించాలంటూ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సభా వేదిక ఏర్పాట్లలో భాగంగా మూడు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు, 3 వేలకు పైగా కుర్చీలు, నీడ కోసం టంట్లు, మైకు సహా తాగునీరు, అల్పాహారం వంటి వాటి కోసం దాదాపు రూ.5.50 లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఎప్పుడో ఇచ్చిన పట్టాలను మళ్లీ పంపిణీ పేరుతో సాగించిన వైసీపీ ఎన్నికల ప్రచారం కోసం పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన ప్రజాధనం ఖర్చు చేయడం ఎంతవరకు సబబు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక సాయంత్రం అక్కడే జరిగిన వలంటీర్ల సన్మాన సమావేశాన్ని కూడా ఎన్నికల ప్రచారంగా వాడుకోవడం కొసమెరుపు.

ఓట్ల కోసం పట్టాల డ్రామా

అర్బన్ ప్రాంతాల్లో సెంటు, రూరల్ పరిధిలో సెంటున్నర విస్తీర్ణంలో నవరత్నాలు లోగో, సీఎం జగన్, వైఎస్సార్ ఫొటోలతో 2020లోనే ఇంటి పట్టాలు పంపిణీ అంటూ ఆర్భాటం చేశారు. గురువారం కార్పొరేషన్ అధికారులు నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఇంటి పట్టాలు పంపిణీ అంటూ మళ్లీ హడావుడి చేయడం విమర్శలకు తావిస్తోంది. కర్నూలు నియోజకవర్గం పరిధిలో 39 వార్డుల నుంచి 3 వేల మందికిపైగా మహిళలను సమావేశానికి బలవంతంగా రప్పించారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఏఎండీ ఇంతియాజ్ అహ్మద్ హాజరై పట్టాలను పంపిణీ చేశారు. గతంలో పట్టాలు అందని పేదలను గుర్తించి ఇంటి పట్టాలు ఇచ్చారనుకుంటే పొరపడినట్లే. నాడు ఇచ్చిన పట్టా స్థానంలో సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు అందజేశారు. ఇదెక్కడి చోద్యం అంటూ మహిళలు సభలో అసహనం వ్యక్తం చేయడం కనిపించింది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ పత్రాలను మెజార్టీ లబ్ధిదారులు అందుకున్నారు. మరో నెలన్నరలో సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఓడిపోతాడని సీఎం జగన్ మళ్లీ టికెట్ ఇచ్చేది లేదని తేల్చేశారు. ఆయన స్థానంలో స్వచ్ఛంద పదవి విమరణ తీసుకున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ అహ్మద్‌ను వైసీపీ సమన్వయకర్తగా ప్రకటించారు. ఓట్ల కోసం ఇంతియాజ్‌ను పరిచయం చేసేందుకు ఇంటి పట్టాల పంపిణీ డ్రామాకు తెరలేపినట్లు నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది.



వనభోజనం ఓ ఆచారం

- పిల్లాపాపలతో కలిసి చెట్ల కింద భోజనం
- 200 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ
- ఇలా చేయడం వల్ల మేలు జరుగుతుందని నమ్మకం


పిల్లాపాపలతో వనభోజనం




గ్రామానికి తిరిగి వస్తున్న ప్రజలు

ఆ ఊరి ప్రజలంతా ఉదయాన్ని ఆరు గంటలకు నిద్ర లేస్తారు. ఇళ్లకు తాళాలు వేసి పిల్లాపాపలతో కలిసి గ్రామ శివార్లలోని చెట్ల కిందకు చేరుకుంటారు. అక్కడే వంట వండుకొని భోజనం చేస్తారు. సాయంత్రం గ్రామానికి చేరుకుని అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం తమ ఇళ్లకు వెళ్తారు. ఇంటినంతా శుభ్రం చేసుకొని అనంతరం పూజలు చేస్తారు. 200 ఏళ్ల నాటి ఈ వన భోజన సాంప్రదాయాన్ని గ్రామస్తులు నేటికీ కొనసాగిస్తున్నారు. ఏటా శివరాత్రికి ఐదు రోజుల ముందు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఇందులోభాగంగానే శనివారం ఆ గ్రామంలో సందడి కనిపించింది. -మద్దికెర



మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో మొత్తం 250 కుటుంబాలు ఉన్నాయి. దాదాపు గ్రామంలో 1300 ఓట్లు ఉన్నాయి. సుమారు 200 ఏళ్ల క్రితం గ్రామంలో చాలా మందికి సంతానం కలగడం లేదని ఇబ్బందులు పడుతుండే వారు. దీంతో అప్పటి గ్రామ పెద్దలు గ్రామంలోని కాశీంతాత స్వామి దగ్గరకు వెళ్లి సమస్యను ఏకరువు పెట్టారు. మాఘ మాసంలో శివరాత్రికి ఐదు రోజుల ముందు శనివారం రోజున గ్రామస్థులంతా ఇళ్లకు తాళాలు వేసి గ్రామ శివార్లకు వెళ్లి చెట్ల కింద వనభోజనాలు చేసుకోవాలని కాశీంతాత స్వామి చెప్పారు. అలా చేయడం వల్ల సంతానం కలుగుతుందని తెలపడంతో గ్రామస్థులు నాటి నుంచి నేటి వరకు అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే శనివారం గ్రామంలోని పిల్లాపాపలు, పెద్దలు అందరూ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. గ్రామ శివారులోని ఎవరికి కావాల్సిన వారు ఒక్కో చెట్టు కింద ఉంటూ వంటా వార్పు చేసుకుని వనభోజనం చేశారు. సాయంత్రం చెట్ల కింద ఉన్న వారు అందరూ ఒకే చోటకు చేరుకున్నారు. అఖండ దీపంతో వచ్చి గ్రామంలోని సుంకులమ్మ అమ్మవారికి పూజలు చేసి కాయకర్పూరాలు సమర్పించారు. అనంతరం తమ ఇళ్లకు వెళ్లి శుభ్రం చేసుకున్న తరువాతం ఇంట్లో కూడా పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఈ సాంప్రదాయం కొనసాగుతోందని, ఈ ఆచారాలను పాటించడం వల్ల గ్రామంలో అందరూ సుఖసంతోషాలతో ఉండడమే కాకుండా పిల్లలు లేని వారికి సంతానం కలుగుతోందని తెలిపారు.



యువత కూడా పాటిస్తోంది

నాటి పెద్దలు పెట్టిన సాంప్రదాయాన్ని యువత కూడా పాటిస్తోంది. గ్రామ శివారులోకి వెళ్లి ఇలా వనభోజనం చేయడం ఆనందంగా ఉంది. నాటి సాంప్రదాయాలు కొనసాగించడం ఎంతో సంతోషంగా ఉంది. - మనోజ్, గ్రామస్థుడు

నాటి సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం



సుమారు 200 ఏళ్ల కిందట నుంచి ఈ సాంప్రదాయం కొనసాగుతోంది. నాటి పెద్దలు ఈ సాంప్రదాయాన్ని అమలు చేసుకుంటూ వచ్చారు. మేము కూడా నేటి వరకు కొనసాగిస్తున్నాం. ఈ సాంప్రదాయం పాటించడం వల్ల గ్రామంలో అంతా మంచే జరుగుతోంది. - ఆంజనేయులు, సర్పంచ్

ఇంటర్ పరీక్షలకు 762 మంది గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 2: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం శనివారం జరిగిన పరీక్షకు కర్నూలు జిల్లా వ్యాప్తంగా 762 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 20,410 మంది ఉన్నారు. ఇందులో 19,648 మంది పరీక్షకు హాజరు కాగా, 762 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐఓతో పాటు డీవీఈఓ జమీర్‌పాషా, డీఈసీ సభ్యులు తనిఖీ నిర్వహించారు.

నంద్యాల జిల్లాలో 633 మంది..

నంద్యాల (నూనెపల్లె), మార్చి 2: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా సెకెండియర్ జనరల్ విభాగంలో 10,178 మంది విద్యార్థులకు గాను 9,607 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా, 571 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో సునీత తెలిపారు. ద్వితీయ సంవత్సర ఒకేషనల్ విభాగానికి సంబంధించి 960 మంది విద్యార్థులకు గాను 898 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 62 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. జనరల్, ఒకేషనల్ విభాగాలలో మొత్తం 633 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని చెప్పారు. జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి తనిఖీ చేసి పరిశీలించారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

కర్నూలు, మార్చి 2: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లా కోర్టు సమీపంలో నాలుగు రోజుల కింద జరిగిన సాయికుమార్ హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆటో నెంబరు సాయంతో నిందితులను పట్టుకున్నారు. సాయిబాబా నగర్‌కు చెందిన మల్లెపోగు మధు, బుధవారపేటకు చెందిన జగదీష్, సాయిబాబా సంజీవనగర్‌కు చెందిన నిసార్ అహ్మద్‌లను అరెస్టు చేశారు. నిందితుల నుంచి కత్తి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మల్లెపోగు మధుపై గతంలో కూడా పలు కేసులు ఉన్నాయి. రౌడీషీట్ కూడా ఉంది. తన కాలనీలో ఉన్న గొడవల కారణంగానే మధు నిరంతరం తన వెంట కత్తి పెట్టుకుని తిరుగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆటోలతో ఒకరికొకరు ఢీకొట్టి హారన్ మోగించడంతోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు శనివారం రాత్రి వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

స్మృతి వనం సమీపంలో పెద్దపులి సంచారం


వెలుగోడు అటవీ ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలను సేకరిస్తున్న అటవీ సిబ్బంది

వెలుగోడు, మార్చి 2: నలమల్ల అటవీ ప్రాంతంలోని వెలుగోడు-ఆత్మకూరు రహదారి సమీపాన ఉన్న స్మృతివనం వద్ద శనివారం ఓ పెద్దపులి సంచరించింది. శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివ భక్తులకు రోడ్డు దాటుతూ పెద్దపులి కంటబడింది. దీంతో వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. హెచ్చరిక బోర్డులపై ఏర్పాటు చేసిన అటవీ అధికారుల ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో వెలుగోడు అటవీశాఖ అధికారి ఎంఏ ఖాన్ సిబ్బందితో ఆ ప్రాంతానికి చేరుకొని పెద్దపులి అడుగు జాడలను సేకరించారు. పెద్దపులి అడుగులుగా నిర్ధారించారు. పులులు అటవీ ప్రాంతంలో సహజంగానే తిరుగుతుంటాయని, రోడ్లు దాటే సమయంలో కనబడటం సహజమేనని తెలిపారు.

రబీలోనూ కరువే..

17 మండలాల్లో దుర్భిక్షం ఉందని నివేదిక

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 2: గత సంవత్సరం ఖరీఫ్‌లో 30 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వం తేల్చింది. ఉమ్మడి జిల్లాలో పంట నష్టపరిహారాన్ని అందించేందుకు కలెక్టర్ డా.జి.సృజన నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఢిల్లీ నుంచి కేంద్ర బృందం అధికారులు కూడా ఉమ్మడి కర్నూలు జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను పరిశీలించారు. తప్పకుండా సాయం అందిస్తామని వారు రైతులకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో కూడా తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు వెంటాడటంతో 17 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి ప్రభుత్వానికి నివేదిక పంపారు. కల్లూరు, గూడూరు, మంత్రాలయం, వెల్దుర్తి, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, కోడుమూరు, ఆదోని, ఓర్వకల్లు, హాలహర్వి, ఆలూరు, ఆస్పరి, తుగ్గలి, మద్దికెర, చిప్పగిరి, హొళగుంద, పత్తికొండ మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నట్లు వ్యవసాయ శాఖ నిర్ధారించింది. పత్తికొండ, చిప్పగిరి మండలాల్లో మధ్యస్థంగా, మిగిలిన 15 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదిక పంపారు. రబీ సీజన్‌లో ప్రధానంగా శనగ, మొక్కజొన్న, కొర్ర, మిరప, టమోటా తదితర పంటలను రైతులు సాగు చేశారు. ఖరీఫ్‌తో పాటు రబీ సీజన్‌లో ప్రభుత్వం గుర్తించిన మండలాల్లో తక్షణమే ఇన్‌పుట్ సబ్సిడీని వెంటనే అందించాలని రైతు సంఘం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

బీహార్ యువకుడి ఆత్మహత్య

పాణ్యం మార్చి 2: మండలంలోని కందికాయపల్లి సుంకులమ్మ దేవాలయం సమీపంలో బీహార్‌కుచెందిన బబ్లూకుమార్ (21) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం బబ్లూకుమార్ కందికాయపల్లి సోలార్‌లో పని చేస్తున్న తన బావ రాంకుమార్‌ను చూసేందుకు బబ్లూకుమార్ వచ్చాడని ఎస్ఐ తెలిపారు. ఈనెల ఒకటో తేదీ శనివారం బయటకు వెళ్లిన బబ్లూ ఎంతసేపటికి రాకపోవడంతో బంధువులు సమీప ప్రాంతాల్లో గాలించారన్నారు. శనివారం ఉదయం చెట్టుకు టవల్‌తో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడు బీహార్ రాష్ట్రం గోపాల్‌గంజ్ జిల్లా, కరారియా గ్రామానికి చెందిన సుదామయాదవ్ కుమారుడన్నారు. బంధువుల రాకకోసం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లల మృతి

కోసిగి, మార్చి 2: కుక్కల దాడిలో శనివారం 20 గొర్రెల పిల్లలు చనిపోయాయి. మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కర్రి బసప్ప, చెన్న బసప్ప, నాగరాజు, బీరప్పలకు సంబంధించిన వీటి విలువ దాదాపు రూ.2లక్షల మేర ఉంటుంది. ప్రభుత్వం గొర్రెల పెంపకంకదారులకు బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని ఏపీ గొర్రెల, మేకల పెంపకందారుల ఫెడరేషన్ నాయకులు వీరనాగప్ప, రాముడు కోరారు.

వైసీపీని గద్దె దించడం ఖాయం

- కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి
- టీడీపీలో చేరిన వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు


కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

డోన్, మార్చి 2: రాబోవు ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలో కోట్ల విస్తృతంగా పర్యటించారు. మాజీ జడ్పీటీసీ కేఈ జయన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఉప సర్పంచ్ కేశవ భట్, సుధీష్ రాజు, ఐటి శివ తదితరుల ఇళ్లకు వెళ్లి టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్కసాగరం లక్ష్మీరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, మద్రి రమణతో కలిసి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఎన్నికలపై చర్చించారు.. అదేవిధంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ కోట్రికే హరికిషన్ నివాసానికి వెళ్లి మద్దతు కోరారు. అనంతరం కోట్ల మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప.. చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ప్రజలపై పన్నుల భారంతోపాటు అన్ని నిత్యావసర ధరలు పెంచేసి ఆర్థికంగా దెబ్బ తీస్తున్నాడని మండిపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి పేదల కడుపు కొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డోన్ నియోజకవర్గంలో ప్రజలకు ఏమి మేలు జరిగిందో చెప్పాలన్నారు. కరువుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత మంత్రి బుగ్గనకు లేదా అని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన కూటమి తిరుగులేని విజయం సాధిస్తాయని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, సీనియర్ న్యాయవాది శ్రీనివాస్‌భట్, భాస్కర్ నాయుడు, పట్టణ టీడీపీ కార్యదర్శి ఎస్ఎండీ రఫి, ఓంప్రకాష్, రంజిత్‌కిరణ్, ఎల్లగౌడు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు: డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు అన్వర్‌బాషా, ఖలీల్, అహ్మద్, దేవరాజు, అబ్దుల్, అహ్మద్, మహ్మద్ హుశేన్, అబ్దుల్ రషీద్, నజీర్ అహ్మద్ తదితరులు టీడీపీలో చేరారు. అదే విధంగా పట్టణానికి చెందిన సాయినాథ్‌రెడ్డి, జగదీష్, మణిదీప్ తదితరులు టీడీపీలో చేరారు. ముస్లిం మైనార్టీల్లో ఎంతో పట్టున్న అన్వర్‌బాషా కుటుంబం టీడీపీలో చేరి మద్దతు పలకడం ఎంతో సంతోషంగా ఉందని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు.

కానిస్టేబుల్ హత్య కేసులో ఏ-2 అరెస్టు

18 నెలల తరువాత పట్టుబడిన నిందితుడు

నంద్యాల క్రైం, మార్చి 2: నంద్యాల పట్టణంలో రెండేళ్ల క్రితం సంచలనం సృష్టించిన కానిస్టేబుల్ సురేంద్ర హత్య కేసులో 2వ నిందితుడు సాకే రాజ్‌కుమార్ అలియాస్ పెద్దిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. గత 18 నెలలుగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న సాకే రాజ్‌కుమార్ అలియాస్ పెద్దిని ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా పోలీసులు విస్తృతంగా గాలించి అరెస్ట్ చేశారు. నంద్యాల పట్టణంలోని రాణి-మహారాణి థియేటర్ సమీపంలోని కుందూ నది బ్రిడ్జి వద్ద తచ్చాడుతున్న నిందితుడిని నంద్యాల రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి తన సిబ్బందితో అరెస్టు చేశారు. 07-08-2022వ తేదీన పోలీస్ కానిస్టేబుల్ సురేంద్రను రౌడీషీటర్లు దారుణంగా హత్య చేసిన విషయం విదితమే. ఈ కేసులో నిందితుడు సాకే రాజ్‌కుమార్ అలియాస్ పెద్ది రెండో నిందితుడు. కానిస్టేబుల్ హత్య కేసులో మొదటి నిందితుడు వెంకటసాయి అలియాస్ కవ్వతో సహా ఎనిమిది మంది నిందితులను గతంలోనే పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే రెండో ముద్దాయి సాకే రాజ్‌కుమార్ పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకు తిరుగుతుండేవాడు. ఎట్టకేలకు నిందితుడిని ఏడాదిన్నర తర్వాత పోలీసులు అరెస్ట్ చేశారు.

హుశేనాపురంలో చోరీ

నగదు, బంగారు అపహరణ

ఓర్వకల్లు, మార్చి 2: నగరంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన రమణమ్మ ఇంట్లో దొంగలు పడ్డారు. తలుపులు పగులకొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను పగులకొట్టి అందులో ఉన్న నగదు, బంగారాన్ని అపహరించుకుపోయారు. బాధితురాలు రమణమ్మ అనారోగ్యం కారణంగా ఆళ్లగడ్డ ఆసుపత్రిలో చూపించుకుని బంధువుల ఇంటి వద్ద ఉండి శనివారం ఉదయం హుశేనాపురం గ్రామానికి చేరుకుంది. ఆమె ఇంటి తలుపులు, బీరువాను పగులకొట్టిడం చూసి నివ్వెరపోయింది. ఇంట్లో ఉన్న రూ.లక్ష నగదు, రెండున్నర తులాల బంగారం నెక్లస్, రూ.1.50 లక్షల బాండ్లు, ఇంటి పత్రాలు దొంగలు అపహరించుకు వెళ్లారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై దాడి

నలుగురిపై కేసు నమోదు

చాగలమర్రి, మార్చి 2: చాగలమర్రిలోని మల్లెవేముల బస్టాండు సమీపంలో మద్యం సేవించి నలుగురు యువకులు అబ్దుల్లా అనే యువకుడిపై దాడి చేశారని ఎస్ఐ రమణయ్య తెలిపారు. గ్రామానికి చెందిన జుబేరు, రింకు, చంద్ర, ముజహిద్ అనే యువకులపై కేసు నమోదు చేశామని అన్నారు. ఈనెల 1వ తేదీ రాత్రి మల్లేవేముల బస్టాండు సమీపంలో అబ్దుల్లా అనే యువకుడు తన స్నేహితుడితో ఘర్షణ పడిన యువకులను ప్రశ్నించేందుకు వెళ్లాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్న వారు అబ్దుల్లాపై రాయితో దాడి చేసి గాయపరిచారని అన్నారు. గాయపడ్డ యువకుడు అబ్దుల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

మద్యం బాటిళ్లు సీజ్

కోవెలకుంట్ల, మార్చి 2: కోవెలకుంట్ల మండలంలో 83 మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు సెబ సీఐ వర్ధనాదేవి నంద్యాల సెబ్ సీఐ విజయకుమార్ శనివారం తెలిపారు. రేవనూరులో నవీన్‌గౌడ్ వద్ద 26 మద్యం బాటిళ్లు, కోవెలకుంట్ల ఎల్ఎం కాంపౌండ్ వద్ద రంగడు వద్ద 25 మద్యం బాటిళ్లు, జమ్మల మడుగు క్రాస్ రోడ్డు వద్ద జాఫర్ అనే వ్యక్తి వద్ద 32 మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు వారు తెలిపారు. నిందితులను అరెస్టు చేసినట్లు వారు చెప్పారు.

భక్తులపై భారం

మహానందీశ్వరుడి ప్రసాదం ధర పెంపు

మహానంది,మార్చి 2: మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆలయంలో విక్రయించే లడ్డూ, వడ ప్రసాదాల ధరలను ఆదివారం నుంచి పెంచుతున్నట్లు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి శనివారం రాత్రి తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు క్షేత్రంలో భక్తులకు విక్రయించే ప్రసాదం ధరలను పెంపొందించినట్లు చెప్పారు. ఇందులో గతంలో వంద గ్రాముల లడ్డును రూ.15 భక్తులకు కౌంటర్ ద్వారా విక్రయించేవారు. పెరిగిన ధరల ప్రకారం రూ.20, 400 గ్రాముల అభిషేకం లడ్డును రూ.75 నుండి వంద రూపాయలకు, వడ ప్రసాదాన్ని రూ.15 నుండి రూ.20 ప్రకారం భక్తులకు విక్రయిస్తామని చెప్పారు.

జిజ్ఞాసతో చదవాలి

- కవి నగ్నముని


ప్రసంగిస్తున్నకవి నగ్నముని

కర్నూలు(కల్చరల్), మార్చి 2: సాహిత్యాన్ని ప్రత్యేకమైన జిజ్ఞాసతో చదవాలని, అందులో కొత్త కోణాన్ని పరిశోధించాలని సుప్రసిద్ధ కవి నగ్నముని అన్నారు. శనివారం రాత్రి నగరంలోని టీజీవీ కళా క్షేత్రంలో సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత మువ్వా శ్రీనివాసరావు రాసిన 'అనితరుడు' పుస్తక పరిచయ సభ నిర్వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన జరిగిన సభలో నగ్నముని మాట్లాడారు. ఇతర కళలు, కవిత్వ రచనకు చాలా తేడా ఉందని, ఏ గురువూ లేని కళ కవిత్వమైతే, కవి స్వయంభూ వంటివాడని చెప్పారు. కవిత్వానికి అనేక కోణా లు ఉంటాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రముఖ కవి మువ్వా శ్రీని వాసరావు రాసిన అనితరుడు పుస్తకంలో ఆయన రాసిన నాలుగు పుస్తకాలతోపాటు, 366 మంది అనేక కోణాల్లో రాసిన వ్యాసాలు దర్శన మిస్తాయని అన్నారు. ఈ పుస్తకం కూడా తెలుగు సాహిత్యంతో ఒక చరిత్ర ఘట్టంగా నిలిచిపోతుందని చెప్పడంలో సందేహం లేదని అన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ వస్తు శిల్ప వైవిధ్యాలన్ని మువ్వా రచనల్లో చూస్తామని, లోతైన కవిత్వం మువ్వాకే సాధ్యమైందని అన్నారు. కవి వెంకట కృష్ణ మాట్లాడుతూ కవితన రచనలను సమాజానికి పరిచయం చేయడంతోపాటు మంచి సందేశం ఇచ్చేలా కృషి చేయాలని, ఆ ప్రయత్నం మువ్వా శ్రీనివాసరావు చేశారని కొనియాడారు. ఈ సభలో పుస్తక రచయిత మువ్వా శ్రీనివాసరావు, కథా రచయిత ఇనాయతుల్లా, విరసం నాయకుడు నాగేశ్వరా చారి, సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షుడు బసవరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం


పవన్‌కుమార్ (ఫైల్)

దేవనకొండ,మార్చి 2: చదువు పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తే ఫలితం లేదు. పేదరికంతో పాటు శ్వాసకోశ వ్యాధులు వెంటాడాయి. దీంతో చివరకు జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దేవనకొండ మండలంలో శనివారం చోటు చేసుకుంది. మండలంలోని పి.కోటకొండకు చెందిన కమ్మరి పవన్ కుమార్ (21) అనే యువకుడు శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పి.కోటకొండకు చెందిన కమ్మరి వెంకటేష్, పుష్పావతి దంపతుల కుమారుడు పవన్ కుమార్ డిప్లమో ఇన్ అగ్రికల్చర్ కోర్సు పూర్తి చేశాడు. ఇదే క్రమంలో కొంత కాలంగా పవన్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడు. ఓ వైపు నిరుద్యోగం, మరో వైపు అనారోగ్యం బాధలు భరించలేకపోయిన పవన్ కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు కోడుమూరు మండలం వర్కూరులో జరుగుతున్న ఉరుసు వేడుకలకు వెళ్లారు. ఇంటిపక్కనే ఉన్న బంధువులు పవన్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దేవనకొండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తుండ్లవాగు రిజర్వాయరులో పడి వ్యక్తి మృతి

రుద్రవరం, మార్చి 2: నల్లమల అడవిలోని తుండ్లవాగు రిజర్వాయరులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రాము (40) అనే వ్యక్తి తుండ్లవాగు రిజర్వాయరులో చేపలు పట్టడానికి వెళ్లాడు. తమిళనాడు నుంచి వలస వచ్చి అహోబిలంలో ఉంటూ గైడ్‌గా పని చేస్తున్నాడు. శని, ఆదివారాల్లో భక్తులకు అహోబిలం చరిత్ర గురించి వివరిస్తూ జీవిస్తున్నాడు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు రిజర్వాయరులో పడి మృతి చెందాడని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఫిర్యాదు అందలేదని, అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని తెలిపారు.



టీజీ భరత్‌ను కలిసిన బ్రాహ్మణ సంఘాల జేఏసీ నాయకులు



టీజీ భరత్‌తో నగర బ్రాహ్మణ సంఘాల జేఏసీ నాయకులు

కర్నూలు(కల్చరల్), మార్చి 2: తెలుగుదేశం పార్టీ కర్నూలు అభ్యర్థి టీజీ భరత్‌ను నగర బ్రాహ్మణ సంఘాల జేఏసీ నాయకులు శనివారం సాయంత్రం కలిశారు. వారిని సాదరంగా భరత్ ఆహ్వానించి మాట్లాడారు. ఇటీవల నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులతోపాటూ కార్యవర్గం ఎన్నిక చెల్లదని, బైలాకు విరుద్ధంగా ఏకపక్షంగా ఎన్నికను నిర్వహించారని బ్రాహ్మణ సంఘాల నాయకులు టీజీ భరత్‌కు వివరించారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లా డుతూ రానున్న ఎన్నికల తర్వాత ఈ సమస్యను పరిష్కరిస్తానని, బైలా ప్రకారం మీకు న్యాయం చేస్తానని ఆయన చెప్పారు. జేఏసీ నేతలు న్యాయ స్థానా న్ని ఆశ్రయిస్తానంటే, వారికి న్యాయం జరిగేలా ఒక న్యాయవాదిని కూడా తాను నియమించి, ఖర్చులు భరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సందేల్ చంద్రశేఖర్, రామరాజు, మారుతిశర్మ, కంచుగంటల శ్యామసుందర్‌రావు, నాగులవరం రాజశేఖర్, కృష్ణకాంత్, డి. ఆనందరావు, టి.రవిశర్మ, గౌరి పెద్ది శేషు, మామిళ్లపల్లి రాజేశ్, సీవీ మురళీకృష్ణ, సుబ్ర హ్మణ్యం ప్రసాద్, ఎన్ రామకృష్ణ, ప్రదీప్‌శర్మ, జేఏసీ కన్వీనర్ దేవీ ప్రసాద్ పాల్గొన్నారు.

'గుడ్ షెఫర్డ్'లో సైన్స్ ఎక్స్‌పో



నమూనాలను పరిశీలిస్తున్న కరస్పాండెంట్ డి.మిన్నల్ల

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 2: స్థానిక విఠల్‌నగర్‌లోని గుడ్ షెపర్డ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరై సైన్స్ ఎక్స్‌పోను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను ఎమ్మెల్యేతోపాటు పాఠశాల కరస్పాండెంట్ డి.మిన్నల్ల పరిశీలించారు. ఉత్తమ నమూనాలను ఎన్నుకుని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలలో అంపశయనం, భేటి బచావో- భేటి పడావో.. చంద్రయాన్-3, సేవ్ ఎర్త్.. సేవ్ వాటర్, సేవ్ ఎనర్జీ అనంతభావి, తదితర అంశాలను విద్యార్థులు చక్కగా ఆంగ్లభాషలో చెప్పిన విధానాలు పలువురిని ఆకర్షించాయి. కార్యక్రమంలో 26వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీ కాంతరెడ్డి, ఉపవిద్యాశాఖ అధికారి హనుమంతరావు, ప్రిన్సిపాల్ కె.మెహరున్నిసా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రవీంద్ర'లో తరంగ్ టూకే 24



నృత్యం చేస్తున్న రవీంద్ర విద్యార్థినులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 2: స్థానిక అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర ప్రైమరీ విభాగం పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా జి.పుల య్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో రవీంద్ర తరంగ్ టూకే 24 శనివారం నిర్వహించారు. రవీంద్ర విద్యాసంస్థల వైస్ చైర్మన్ జి.వంశీధర్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా ఉప విద్యాధికారి హనుమంతరావు, కల్లూరు మండలం విద్యాధికారి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు విద్యావ్యవస్థలో అనేక మార్పులు వస్తున్నాయని, వీటికి అనుగుణంగా ఉపాధ్యాయులు, బోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని విద్యా ర్థులను తీర్చిదిద్దాలన్నారు. అనంతరం జి.పుల్లయ్య, చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శ్రీనివాసరావు, అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్, రిడ్జ్ పాఠశాల సీఈవో జి.గోపీనాథ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, మార్చి 2: నగరంలో నెలవారి విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కర్నూలు డివిజన్ ఆపరేషన్ ఈఈ చక్రపాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పాతబస్తి సెక్షన్, కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ సెక్షన్ ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ కోత ఉంటుందని ఏడీఈ-2 రాజేంద్రబాబు తెలిపారు. ఈ మేరకు పాతన గరంలోని గీతా మందిర్ ఏరియా, దండగేరి, ఉస్మానియా కాలేజీ రోడ్డు, కల్లూరు ఎస్టేట్‌లోని పోలీస్ కాలని ఏరియా, రాయలయం వీధి, గాయత్రి ఎస్టేట్, బిర్లా గడ్డప్రాంతాల్లో సరఫరాల అంతరాయం ఉంటుందని ప్రజలు గమనించాలని కోరారు.

టీడీపీలోకి వైసీపీ నాయకులు

సి.బెళగల్, మార్చి 2: మండలంలోని ముడుమాల గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఆర్.పౌలు ఆధ్వర్యంలో శనివారం కర్నూలులో టీడీపీ సీనియర్ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి సమక్షంలో 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో విజయ్, రాజు, నాగరాజు, అజయ్, మాదన్న, కొండల్, సామేలు, సుంకన్న, హను మంతు, మద్దిలేటి, తుమ్మల మద్దిలేటి, రోగోడు, అనంతకుమార్, శ్రీనివాసులు, నరసింహులు, సుంకన్న, కమ్మరి మహేష్, మద్దిలేటి, చాకలి దుబ్బన్న ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు రామిరెడ్డి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 కేసులు

కర్నూలు, మార్చి 2: నగర శివారులో సుంకేసుల రోడ్డులో సంజీవని హాస్పిటల్ వద్ద శనివారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఏడు ద్విచక్ర వాహనదారులను, ముగ్గురు కారు డ్రైవర్లు, ఒక ఆటో డ్రైవర్ పోలీసులకు చిక్కారు. వీరి వాహనాలు సీజ్ చేసి వీరిపై కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ చేసిన వాహనదారులను సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని సీఐ గౌతమి తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 2: ఏపీఎస్ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 4న విజయవాడలో తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, పీఎఫ్, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, వారాంతపు సెలవులు మంజూరు చేయాలని, హైర్ బస్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

టీడీపీ విజయాన్ని ఏ శక్తి ఆపలేదు

» పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న గౌరు చరిత

కల్లూరు, మార్చి 2: తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఏ శక్తి ఆపలేదని, మే తర్వాత టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు కానుందని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. శనివారం 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో ఆమె బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికల మేనిఫెస్టో కరపత్రా లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని కుట్రలు పన్నినా టీడీపీ-జనసేన కూటమి గెలుపు తథ్యమన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల కోసం చంద్రబాబు ఆరు పథకా లను ప్రవేశపెట్టారన్నారు. శంఖారావం, బాబు ష్యూరిటీ కార్యక్రమాలను ప్రజ లకు వివరించాలని క్లస్టర్, యూనిట్, బూత్‌లెవల్ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, టీడీపీ జిల్లా కోశాధికారి పీయూ మాదన్న, కాసాని మహేస్‌గౌడ్, అయ్యప్పరెడ్డి, శేఖర్‌చౌదరి, పెద్దబీచుపల్లి, టైలర్ నాగరాజు, ఖాజా, బందేనవాజ్, మాజీ కార్పొరేటర్ సోమన్న, కోటేష్‌గౌడ్, జనసేన నాయకులు సుధాకర్, శ్రీనివాసరెడ్డి, నగేష్, రాజు పాల్గొన్నారు.

● **వివేకా హత్య కేసులో జగన్ పాత్రపై విచారణ చేపట్టాలి:** వివేకా నందరెడ్డి హత్యకేసులో జగన్‌రెడ్డి పాత్రపై సీబీఐ విచారణ చేపట్టాలని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం జగన్‌రెడ్డి ముఠానే వైఎస్ వివేకాను హత మార్చిందని ఆరోపించారు. గొడ్డలి పోటుతోనే బాబాయ్ చనిపోయారని జగన్‌రెడ్డి కచ్చితంగా ఎలా చెప్పగలిగారన్నారు. సీబీఐ విచారణ చేయాలని సునీతమ్మ కోరితే జగన్ రెడ్డి ఎందుకు ఆపారని, మొదట సీబీఐ విచారణ కావాలని కోరిన జగన్ తర్వాత వద్దు అనడం వెనుక ఉన్న కారణాలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. తన తండ్రికి న్యాయం చేయాలని కూతురు సునీతమ్మ పోరాడుతుంటే తమ్ముడు అవినాష్‌ను సీబీఐ అరెస్టు చేయకుండా జగన్ అడ్డుపడుతున్నారని అన్నారు.

వివేకా కేసులో జగన్‌ను విచారించాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



మాట్లాడుతున్న బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), మార్చి 2: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రాజకీయ లబ్ధి కోసం వారి ముఠానే వివేకానందరెడ్డి హత మార్చిందని, గొడ్డలి పోటుతోనే బాబాయ్ చనిపోయారని అంత కచ్చితంగా జగన్ ఎలా చెప్పగలరని అనుమానం వ్యక్తం చేశారు. సీబీఐ విచారణ చేయాలని సునీతమ్మ కోరితే జగన్ రెడ్డి ఎందుకు ఆపారని, మొదట సీబీఐ విచారణ కావాలని కోరిన జగన్ తర్వాత వద్దు అనడం వెనుక ఉన్న కారణాలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్‌రెడ్డి సీబీఐ విచారణ పిటిషన్‌ను ఎందుకు వెనక్కి తీసుకున్నారని ప్రశ్నించారు. బాబాయ్ హత్య చేసిన అబ్బాయిని జగన్‌రెడ్డి ఎందుకు కాపాడుతున్నారు. దీని వెనుక ఉన్న ఆంతర్యమేంటని, సీఎం అయిన తర్వాత కేసు ఎందుకు పురోగతి కాలేదని ప్రశ్నించారు. వివేకానందరెడ్డి ఎలా చనిపోయారో జగన్‌కు తెలుసు కానీ ఎందుకు దాచాలనుకుంటున్నారు. ముఖ్య మంత్రిగా కొనసాగే అర్హత జగన్‌కు లేదన్నారు. సొంత చెల్లికి న్యాయం చేయ లేని జగన్ రాష్ట్రంలోని అక్కా, చెల్లెల్లకు ఏమీ న్యాయం చేస్తారు. విలువలు గురించి పదేపదే మాట్లాడే వైసీపీ నాయకులు ఇప్పటికైనా విలువల గురించి మాట్లాడటం మానుకోవాలన్నారు. జగన్ చెప్పినట్లు పెత్తందారులు, పేదలకు మధ్య యుద్ధం కాదు.. హంతకులకు, రాష్ట్ర ప్రజలకు మధ్య యుద్ధమని అన్నారు. సునీతమ్మ చేస్తున్న పోరాటానికి టీడీపీ అండగా ఉంటుందని తెలిపారు.

టీడీపీలోకి భారీగా చేరికలు



విష్ణు సమక్షంలో టీడీపీ చేరిన గూడూరు ముస్లిం మైనార్టీ నాయకులు

కర్నూలు(రూరల్), మార్చి 2: తెలుగుదేశం పార్టీలోకి వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుతున్నారు. సి.బెళగల్ మండలం మారందొడ్డి గ్రామానికి చెందిన దాదాపు వంద కుటుంబాలు శనివారం కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ కోడుమూరు అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వారికి విష్ణువర్ధన్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా విష్ణు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాలను ఎక్కడా కూడా అభివృద్ధి చేయలేదన్నారు. టీడీపీలో చేరిన వారిలో పౌలయ్య, చిలకరాజు, బాలరాజు, దేవపుత్ర, మోజేష్, ఐజేష్, మహేష్, ఏసేపు, దేవన్న, శ్యామ్‌బాబు, నూర్‌భాష, మల్లి, రంగన్న, మల్లికార్జున, శ్యామరాజు, యాకోబు, చిన్నరాముడు, సోమప్ప, చిన్నరాజు, ఉన్నారు. కార్యక్రమంలో సి.బెళగల్ మండలం మాజీ జడ్పీటీసీ సభ్యులు చంద్ర శేఖర్, జిక్రియా బాషా పాల్గొన్నారు.

టీడీపీలోకి గూడూరు ముస్లిం మైనార్టీలు: గూడూరు నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు ఆధ్వర్యంలో కోట వీధి వైసీపీ కౌన్సిలర్ కలాం మద్దతుదారులైన ముస్లిం మైనార్టీ నాయకులు సయ్యద్ బాషా, ఇసూఫ్, షామ్‌షా, షేక్షావలి, సయ్యద్ వాహిద్, ఖాజా, కూరగాయల చాంద్, కోడు మూరు షాషా కలిసి కర్నూలులో విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో గూడూరు పట్టణ టీడీపీ నాయకులు మధు, సృజన్, రామాం జనేయులు, పౌలు, కౌన్సిలర్లు షేక్షావలి, బుడ్డాంగలి పాల్గొన్నారు.

నేడు మహిళా వైద్యుల ర్యాలీ



మాట్లాడుతున్న ఐఎంఏ మహిళా వింగ్ డాక్టర్లు

కర్నూలు (హాస్పిటల్), మార్చి 2: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని ఐఎంఏ ఉమెన్ వింగ్ వైద్యులు ఆదివారం ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు నగరంలోని రాజ్‌విహార్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ నిర్వహిస్తానమి ఐఎంఏ ఉమెన్ వింగ్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డా.మాధవీ శ్యామల, డా.విష్ణుప్రియ, కోశాధికారి డా.లక్ష్మీబాయి తెలిపారు. శనివారం నగరంలోని పార్థసారధినగర్ ఐఎంఏ భవన్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా ఐఎంఏ భవన్‌లో ఉదయం 10.30 గంటలకు సీనియ ర్ మహిళా వైద్యులను సన్మానం ఉంటుందని, ఓమెగా హాస్పిటల్ సహకారంతో వైద్యులకు మమోగ్రామ్, పాప్‌పీమియర్ టుడి ఇకో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

మెరుగైన వైద్యం అందించండి : గౌరు



అయూబ్ బాషాను పరామర్శిస్తున్న గౌరు వెంకటరెడ్డి

ఓర్వకల్లు, మార్చి 2: ఓర్వకల్లు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త ఐ టీడీపీ అయూబా బాషాకు మెరుగైన వైద్యం అందించాలని టీడీపీ నంది కొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి వైద్యులను కోరారు. అనారోగ్యంతో కర్నూలు నగరంలోని అమీలియో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అయూబ్ బాషాను శనివారం గౌరు వెంకటరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, కార్యకర్తలు అల్లబాబు, శ్రీరాములు, హర్షవర్ధన్ రెడ్డి, అబ్దుల్లా పరామర్శించారు.

ఆస్తి పన్ను వడ్డీ మాఫీ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 2: నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్నుల, ఖాళీ స్థలం పన్నుల బకాయిలను 2023-24 రెండో ఆర్థిక సంవత్సరం వరకు పూర్తిగా చెల్లించిన వారికి అపరాధ రుసుము మాఫీ చేస్తున్నట్లు కమిషనర్ భార్గవతేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే వడ్డీతో పన్ను చెల్లిం చిన వారికి రాబోవు పన్నుకు సర్దుబాటు చేస్తామని, సెలవు రోజులలో కూడా పన్ను వసూలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. పన్నును నగర పాలక సంస్థ కార్యాలయం, వార్డు సచివాలయం, ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చునని, సీనియర్ సిటిజన్లు, మహిళలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

మోదీ ప్రధాని కావాలని పాదయాత్ర

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 2: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాన మంత్రి కావాలని కోరుతూ శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు ఆత్మకూరు నుంచి బీజేపీ కోడుమూరు నియోజకవర్గ కన్వీనర్ మీసాల ప్రేమ్ కుమార్ పాదయాత్ర చేశారు. నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్య కర్తలతో కలిసి పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించు కున్నారు. మోదీ గత పదేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని అగ్రభాగంలో నిలిపారని ప్రేమ్ కుమార్ తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 2: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో నిర్వహిస్తున్న ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారి శామ్యూల్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా అధక్షుడు రంగప్ప, కార్యదర్శి అబ్దుల్లా శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ విద్యాసంవత్సరం పూర్తి కాకముందే కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పోస్టర్లు, బ్యానర్ల ద్వారా అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ఫీజులో మినహాయింపు ఉంటుందని, విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు అమర్ పాల్గొన్నారు.

రాయలసీమ క్రిస్టియన్ కళాశాల ప్రిన్సిపాల్‌కు పురస్కారం

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 2: రాయలసీమ క్రిస్టియన్ బీఈడీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న దారపోగు ప్రకాష్‌కు కొలుకలూరి ఇనాక్ పురస్కారం లభించింది. కవిత్వం, సామాజిక చైతన్యం అనే అంశంపై పరిశోధన చేసినందుకు గానూ ఈ పురస్కారం వరించింది. హైదరాబాదు తెలుగు విశ్వవిద్యాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లి భట్టు విక్రమార్క, ఉపకులపతులు కిషన్‌రావు, కొలకలూరి మధుజ్యోతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం



హుశేనాపురంలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఓర్వకల్లు, మార్చి 2: పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉషాకిరణ్ పాఠశాల హెచ్ఎం మురళి అన్నారు. శనివారం మండ లంలోని హుశేనాపురం గ్రామ జాతీయ రహదారిపై ఉషాకిరణ్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యులు, సచివాలయ సిబ్బంది ఆదివారం చేపట్టే పోలియో చుక్కల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన శిశువు మొదలుకుని ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాల న్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రమణ, ఏఎన్ఎంలు జీవ జ్యోతి, స్వాతి, ఆశావర్కర్లు సునిత, సావిత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేయాలి

» సెక్టోరల్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు



మాట్లాడుతున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 2: కర్నూలు నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేయాలని సెక్టోరల్ అధికారులను కర్నూలు అసెంబ్లీ ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ అధికారి, కార్పొరేషన్ కమిషనర్ భార్గవతేజ ఆదేశించారు. శనివారం కార్యాలయంలోని పాతకౌన్సిల్ హాలులో సెక్టోరల్ అధికారులు, పోలీసు అధికారులతో సాధారణ ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులు, పోలీసులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించి అక్కడ కనీస వసతులు ఉన్నాయా.. లేవా అనే విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఈసమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, కర్నూలు అర్బన్ తహసీల్దారు మోహన్‌కుమార్, వన్ టౌన్, టు టౌన్, త్రీ టౌన్, ఫోర్త్ టౌన్ సీఐలు పాల్గొన్నారు.

ఉత్తర్వులు నిలుపుదల చేయాలి: ఎస్టీయూ



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 2: ఉపాధ్యాయులపై బైండోవర్ కేసుల ఉత్తర్వులను వెంటనే నిలుపుదల చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌కు శనివారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2020, 22 పదో తరగతి పరీక్షల్లో నంద్యాల జిల్లా అంకిరెడ్డిపల్లెతోపాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు మాల్‌ప్రాక్టీసు కింద బుక్ అయ్యారని అన్నారు. ఆ ఉపాధ్యాయులంతా ప్రస్తుతం హొళగుంద, చిప్పగిరి, హాలహర్వి, కోసిగి మండలాల్లో పని చేస్తున్నారని, వారికి గత సంవత్సరం బైండోవర్ కేసుల నుంచి మినహాయింపు ఇచ్చినప్పటికీ 2024 పబ్లిక్ పరీక్షల్లో డ్యూటీలు కూడా వేయలేదన్నారు. అయితే బైండోవర్ కావాలని వేధిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న పోలీసులతో డీఈవో మాట్లాడి ఉత్తర్వులను వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. డీఈ వోను కలిసిన వారిలో ఎస్టీయూ నాయకుడు వై.శ్రీనివాసులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సి.బెళగల్, మార్చి 2: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో శకుంతల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో పంచాయతీల కార్యదర్శులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని పత్రికల్లో వస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవన్నారు. అలాగే పంచాయతీలలో అనుమతి లేని కొళాయి కనెక్షన్లు తొలగించాలని, కొళాయి, ఇంటి పన్నులను వసూలు చేయాలని అన్నారు. ఈసమావేశంలో ఈవో ఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

7న రసాయన విపత్తు మాక్ డ్రిల్



మాట్లాడుతున్న డీఆర్వో

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 2: కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో టీజీవీ రాయలసీమ ఆల్కాలీస్ అలైడ్ కెమికల్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ఈ నెల 7న నిర్వహించనున్న రసాయన విపత్తు మాక్ డ్రిల్‌ను విజయవంతంగా నిర్వ హించేలా చర్యలు చేపట్టాలని డీఆర్వో మధుసూదన్‌రావు సంబంధిత అధికా రులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రసా యన విపత్తు మాక్‌డ్రిల్‌కి సంబంధించి తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో డీఆర్వో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోని పరిస్థితులలో పరిశ్రమల్లో రసాయన విపత్తుల ప్రమాదాలు సంభవించినప్పుడు విపత్తును ఎలా ఎదుర్కోవాలనే దానిపై ఈ నెల 7న కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో టీజీవీ రాయలసీమ ఆల్కాలీస్ అలైడ్ కెమికల్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో క్లోరిన్ వాయువు లీక్ అయితే.. సంభవించే అత్యవసర పరిస్థితులపై మాక్ డ్రిల్ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, డీటీసీ శ్రీధర్, డీపీవో అనుపమ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి



విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు రూరల్, ఫిబ్రవరి 2: తెలుగుదేశం పార్టీ గెలుపునకు కృషి చేస్తామని కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి పి.కిశోర్, మాజీ సర్పంచ్ ఇ.శ్రీనివాసుల గౌడ్, ఉప సర్పంచ్ చాంద్ బాషా అన్నారు. శనివారం కోడుమూరు నియోజకవర్గం (ఎస్సీ) టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, మాజీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డిలను కలసి మద్దతు ప్రకటించారు. అనంతరం విష్ణును సన్మానించారు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న ఆకెపోగు ప్రభాకర్ నాయకత్వంలో పని చేశామని, అధినేత చంద్రబాబు అభ్యర్థిగా ప్రకటించిన బొగ్గుల దస్తగిరి గెలుపునకు కృషి చేస్తామన్నారు. తమ లక్ష్యం టీడీపీ గెలవాలి.. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి అన్నారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జిలు రామకృష్ణా, ఎల్లాకృష్ణా, పి.మోహన్, ఎస్.రసూల్, రఫీ, గోరంట్ల ఏసు, అశోక్, రియాజ్ బాషా, బాలమద్దయ్య పాల్గొన్నారు.

9న రాష్ట్ర స్థాయి భజన పోటీలు

ఓర్వకల్లు, మార్చి 2: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 9న కాల్వబుగ్గలో రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, ఆలయ ప్రధాన అర్చకుడు కల్లె లక్ష్మీనారాయణశర్మ, ఆకుల మహేష్ శనివారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే సభ్యులు ప్రవేశ రుసుం రూ.400లు చెల్లించి రశీదు పొందాలన్నారు విజేతలకు మొదటి నుంచి 12 బహుమతులు వరుస గా రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.9వేలు, రూ.8వేలు, రూ.7వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతులను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 9000194078, 9985793992 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ముస్లింల హక్కుల కోసం పోరాటం

కర్నూలు(న్యూసిటీ), మార్చి 2: ముస్లింల హక్కుల సాధన కోసం పోరాడతామని ముస్లిం మైనార్టీ హక్కుల రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహబూబ్‌బాషా అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 10న నంద్యాల పట్టణంలో ముస్లిం మైనార్టీ మహాగర్జన నిర్వహిస్తున్నామన్నారు. నంద్యాలలో జరిగే మహాగర్జనకు పెద్ద ఎత్తున ముస్లింలు తరలి రావాలని పిలుపునిచ్చారు. నాయకులు రోషన్ అలీ, ఎంఎం.బాషా, షోయబుద్దీన్ ఖాద్రి, సయ్యద్ షాముర్తుజా ఖాద్రి పాల్గొన్నారు.

ఇనగండ్లలో రోడ్డుపైనే మురుగు నీరు



రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

సి.బెళగల్, మార్చి 2: మండలంలోని ఇనగండ్ల గ్రామ ప్రధాన రహదారిపైనే మురుగు నిల్వ ఉంటోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈవిషయాన్ని పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మురుగు నీటిలో పందులు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. దీంతో తాము రోగాల బారిన పడుతున్నా మని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

వివేకా కేసులో జగన్‌పై విచారణ జరగాలి : కేఈ


మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

పత్తికొండ, మార్చి 2: వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్‌రెడ్డిపాత్రపై విచారణ జరపాలని టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం జగన్ ముఠానే వివేకాను హతమార్చిందని, గొడ్డలిపోటుతోనే బాబాయ్ చనిపోయాడని జగన్‌రెడ్డి అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలిగారో విచారించాలని అన్నారు. హత్యకేసుకు సంబంధించి సునీతమ్మ సీబీఐ విచారణకు పిటిషన్ వేస్తానంటే జగన్‌రెడ్డి ఎందుకు ఆపారని ప్రశ్నించారు. మొదట సీబీఐ విచారణ కోరిన జగన్ ముఖ్యమంత్రి అయ్యాక సీబీఐ పిటిషన్ ఎందుకు వెనక్కుతీసుకున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. ఇంటి ఆడబిడ్డకు న్యాయం చేయలేని జగన్ రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలకు ఏం న్యాయంచేస్తాడో ప్రజలే గుర్తించాలని పేర్కొన్నారు.

రబీ పంటల నమోదు జాబితా ప్రదర్శన

తుగ్గలి, మార్చి 2: ఈ ఏడాది రబీలో సాగు చేసిన పంటలను ఈక్రాప్ నమోదు చేసుకున్న జాబితాను ఆర్‌బీకేలో ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని రామకొండ, పెండేకల్ తదితర గ్రామాల్లోని ఆర్‌బీకే కేంద్రాల వద్ద 2023-24 పంటలకు సంబందించి రబీలో సాగు చేసిన 7,282 ఎకరాల్లో పంటలను ఈక్రాఫ్ నమోదు చేసి ఆర్‌బీకే కేంద్రాల వద్ద ప్రదర్శించారు. రైతులు పరిశీలించి ఏవైనా అభ్యంతరాలుంటే 3వ తేదీలోపు వ్యవసాయాధికారులకు రాతపూర్వకంగా దరఖాస్తు రాసి ఇవ్వాలని సూచించారు.

ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

మద్దికెర, మార్చి 2: మద్దికెరలోని ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి గానూ 6వ తరగతి ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కరణం సవిత తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఫారం, జిరాక్స్ కాపీలను స్థానిక ఆదర్శ పాఠశాలలో అందజేయాలని సూచించారు.

పేదల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం

మద్దికెర, మార్చి 2: పేదలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించడమే టీడీపీ లక్ష్యంగా పని చేస్తోందని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజనేయులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పారా విరోభ అన్నారు. శనివారం మద్దికెరలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో పేదలకు, యువతకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి అధోగతి పాల్చేశారని విమర్శించారు. టీడీపీ నాయకులు బొల్లాపురం చంద్ర, ఆవుల నాగరాజు, తదితరులు ఉన్నారు.

రైతులకు సున్నా వడ్డీ మంజూరు

మద్దికెర, మార్చి 2: మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులకు 2021-22 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో 2,513 మంది రైతులకు రూ.65,53,514, రబీ సీజన్‌లో 433 మంది రైతులకు రూ.9,77,630 సున్నా వడ్డీ పంట రుణాలు మంజూరైనట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. శనివారం మండలంలోని ఆయా ఆర్‌బీకే కేంద్రాల్లో సున్నా వడ్డీ పంట రుణాలకు సంబంధించి జాబితాను ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించారు. వీఏఏలు జాకీర్ హుశేన్, ఆనంద్, రాణి ఉన్నారు.

ఏబీ కరాటే అకాడమీ విద్యార్థుల ప్రతిభ

వెల్దుర్తి, మార్చి 2 : అనంతపురం జిల్లా గుంతకల్లులో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ కరాటే చాంపియన్‌షిప్‌లో ఏబీ కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరచి పతకాలు సాధించారు. అండర్-6 విభాగంలో విక్రాంత్, అరుణ్ బంగారు, అండర్-7లో మహేశ్వరీ సిల్వర్, అండర్-8లో రన్విత, వరుణ్ బంగారు, అండర్-9లో జీవన్ బంగారు, ఆదరణ సిల్వర్, అండర్-10 విభాగంలో దుర్గ, షాబీర్ సిల్వర్ పతకాలు సాధించారని ఏబీ కరాటే అకాడమీ ఇన్‌చార్జి జె.ఫయాజ్ శనివారం తెలిపారు.

ఆధ్యాత్మిక ముసుగులో రాజకీయ ప్రచారం


మాట్లాడుతున్న నూర్ అహమ్మద్

ఆదోని టౌన్, మార్చి 2: ఇస్లాం మతపరమైన బోధనలను చేసే పీస్ మెసేజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు సిరాజ్ ఉర్ రెహమాన్ ఆధ్యాత్మిక ముసుగులో రాజకీయ ప్రచార సభలు నిర్వహించడం సబబు కాదని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ. నూర్ అహ్మద్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి, పెద్దకూరపాడు, గురజాల నియోజకవర్గాలలో బ్రదర్ సిరాజ్ ఏర్పాటు చేసిన ముస్లిం సభలలో ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడిన అనంతరం వైసీపీ నాయకులతో మాట్లాడించడం, వైసీపీకే ఓటు వేయాలని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆయనకు వైసీపీ పార్టీ మీద అంత ప్రేమ ఉంటే, పార్టీ కండువా వేసుకొని వైసీపీ నాయకుడిగా చలామణి కావడం ఉత్తమమని హితవు పలికారు. ముస్లింలను మతసభల కోసం ఆహ్వానించి వారికి వైసీపీ నాయకుల సంభాషణ వినిపించడం, ముస్లింలను మోసం చేయడమేనని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఆదోని పట్టణంలో 4వ తేదీన బ్రదర్ సిరాజ్ సమావేశం ఏర్పాటు చేసారని, ముస్లిం మత సభల నుంచి రాజకీయాలను దూరంగా ఉంచడం ఎంతో అవసరమని, ఇక మీదట ఇలా జరగకుండా చూడాలని ఆయన సూచించారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

నందవరం, మార్చి3: మండలంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు ఆదివారం నుంచి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యా కమిషనర్ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వచ్చే నెల 21 ఉదయం 10 గంట నుంచి 12 గంటల వరకు మోడల్ స్కూళ్లలో 5వ తరగతి స్థాయి సిలబస్‌తో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పాఠశాలలో ఆగ్లమమాధ్యంలో మాత్రమే బోధిస్తారని, చదువుకోవడాని ఎలాంటి ఫీజులు కట్టనవసరం లేదని తెలిపారు. మార్చి 3 నుంచి 31 లోపు పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్లు నిబంధనల ప్రకారం సీట్లు కేటాయిస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రమణీయం ప్రహ్లాద రాయల రజిత రథోత్సవం


రజిత రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మార్చి 2 : మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయలు రజిత రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజిత రథంను వివిధ పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రహ్లాద రాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల మంటపంలో ఉత్సవమూర్తిని అధిష్ఠించి ఊంజలసేవ నిర్వహించారు.

ఈ అన్నం ఎలా తినాలి ?

● నాసిరకంగా మధ్యాహ్న భోజనం

● పట్టించుకోని అధికారులు


విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం


అన్నం, నీళ్లచారు చూపిస్తున్న విద్యార్థి

హొళగుంద, మార్చి 2: గోరుముద్ద పేరుతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడతున్నాం అని ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. గ్రామీణ స్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతోంది. పర్యవేక్షణ లోపంతో అధికారులు పట్టించుకోకపోవడంతో, మధ్యాహ్న భోజనం నిర్వాకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఈ భోజనం ఎలా తినాలని ప్రశ్నిస్తున్నారు. హొళగుంద మండల పరిధిలోని ముద్దటమాగి గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో 150 మంది విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నారు. శనివారం మాత్రం 125 మంది విద్యార్థులు భోజనం చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు మాత్రం విద్యార్థులకు సరిపడినంత ఆహారం తయారు చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు వాపోతున్నారు. 150 మందికి గాను కేవలం 75 మంది విద్యార్థులకు మాత్రమే భోజనం తయారు చేస్తున్నారని, మెనూ ఏ మాత్రం పాటించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. శనివారం వెజిటేబుల్ రైస్, సాంబార్, పాయసం చేయాల్సి ఉండగా, అన్నం, నీళ్ల చారు. పాయసం అంటూ ఏదో ఓ వంటకం చేసి మమ అనిపించారు. ఈ భోజనాన్ని కొందరు విద్యార్థులు తినగా మిగతా పిల్లలు పాఠశాల ఆవరణలోనే పాడేయడం కనిపించింది. రుచి, శుచి లేకుండా వంట చేయడంపై ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా కూరగాయలు తేలేదని, అందుకే అన్నం, చారు చేశామని నిర్వాహకులు తెలిపారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలి కదా అని అడగగా పిల్లలకు ఏదో ఒక్కటి వడ్డించాం కదా అంటూ సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై హెచ్‌ఎం జయరాజును వివరణ కోరగా ప్రతిరోజూ భోజనం బాగుంటుందని, ఈ రోజు ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజ ఉండటంతో నేను అక్కడికి వెళ్లడంతో వంట ఇలా చేశారాని తెలిపారు.

పోలియో రహిత దేశాన్ని నిర్మిద్దాం

ఆదోని టౌన్, మార్చి 2: పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం చైర్‌పర్సన్ బోయ శాంత ఆధ్వర్యంలో ప్రధాన వీధులలో పోలియోపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించడం ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ సత్యవతి, అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అనుపమ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తుగ్గలి : తుగ్గలి, పగిడిరాయి వైద్యశాలల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్, ఫాతిమా, హరిత మాట్లాడుతూ ఆదివారం ప్రతి గ్రామంలో ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, చందు నాయక్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర : మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణీ ఆధ్వర్యంలో పల్స్ పోలియో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో నిరంజన్ ప్రసాద్, అక్బర్‌బాషా విజయ్ తదితరులు ఉన్నారు.

వెల్దుర్తి : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం విలాసిని ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోలియో చుక్కలు వేస్తున్నారని ఆరోగ్య సిబ్బంది తెలియజేశారు.

మంత్రాలయం : 3వ తేదీన ఆదివారం పల్స్ పోలియోను సమష్టిగా విజయవంతం చేద్దామని మండల వైద్యాధికారులు గోవిందమ్మ, సురేష్ అన్నారు. మంత్రాలయం, కాచాపురం , కల్లుదేవకుంట గ్రామాల్లో 0-5 ఏళ్ల చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ర్యాలి నిర్వహించారు.


చిప్పగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్, వైద్యాధికారులు

చిప్పగిరి : తహసీల్దార్ కే పద్మజ, మండల వైద్యాధికారిని అఫ్రోజ్ జహాన్, సిహెచ్‌వో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిప్పగిరి అంబేడ్కర్ కూడలిలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆదివారం మండలంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో పిల్లలను గుర్తించి వారికి పోలియో మందు వేయించనున్నట్లు పేర్కొన్నారు.

కౌతాళం : పోలియో రహిత సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏఎన్‌ఎం హనుమంతమ్మ అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో పల్స్ పోలియో కార్యక్రమంపై ఆశావర్కర్లు, వైద్య సిబ్బందితో కలసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్రంలో టీడీపీ జెండా ఎగరేద్దాం

● మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, మార్చి 2: అధికారంలోకి వచ్చాక టీడీపీ అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి విజయానికి కృషి చేద్దామని మాజీ ఎమెమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. శనివారం తన నివాసంలో టీడీపీ శంఖారావం కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్లస్టర్ సభ్యులు, యూనిట్ సభ్యులు, బూత్ కమిటీ సభ్యులకు కార్యకర్తల సమక్షంలో సూపర్ సిక్స్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ప్రతి గ్రామ, వార్డులలో ఇంటికి వెళ్లి టీడీపీ రిజిస్ట్రేషన్ చేయించి విజయవంతం చేయాలని సూచించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించాలని సూచించారు. వైసీపీ ప్రజా వ్యతిరేకతను దోపిడీని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, భూపాల్ చౌదరి, రంగస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే భవిష్యత్తుకు గ్యారంటీ : బీవీ


సంజీవయ్య నగర్‌లో ప్రచారం చేస్తున్న జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, మార్చి 2: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటి అని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సంజీవయ్య నగర్‌లో బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారంటీపై ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటి వరకు అరాచక పాలన సాగిస్తు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మండిపడ్డారు. ప్రస్తుతం ఎన్నికల్లో కొంతమంది ఆస్తులను కాపాడుకునేందుకు డబ్బు సంచులతో వస్తున్నారని, వారి డబ్బు తీసుకొని తెలుగుదేశానికి ఓటు వేయాలని సూచించారు. టీడీపీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ కొండయ్య చౌదరి, కౌన్సిలర్లు రామదాసు గౌడ్, వీజీఏ దయాసాగర్, మాజీ కౌన్సిలర్లు రంగస్వామి గౌడ్ పాల్గొన్నారు.

డిజిటలైజేషన్‌లోకి కేంద్ర గిడ్డంగులు

● ఘనంగా కేంద్ర గిడ్డంగుల ఆవిర్భావ దినోత్సవం

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 2: దేశంలోని కేంద్ర గిడ్డంగులన్నింటిని ప్రభుత్వం డిజిటలైజేషన్‌లోకి మార్చుస్తుందని ఆదోని కేంద్ర గిడ్డంగుల కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) మేనేజర్ త్యాగరాజు పేర్కొన్నారు. శనివారం మార్కెట్ యార్డ్ సమీపంలోని వేర్‌హౌస్ ఆవరణంలో 68వ కేంద్ర గిడ్డంగుల ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌కట్ చేసి రిటైర్డ్ ఉద్యోగులు తిప్పన్న, జాన్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు గిడ్డంగుల కంటే ప్రభుత్వ రంగ సంస్థ దిడ్డంగులతో రైతుల సరుకు భద్రతతో పాటు తక్కువ ధరకే నిలువ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. నిల్వ ఉంచిన ధాన్యంపై బ్యాంకు రుణాలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు. త్వరలోనే ఎలక్ట్రానిక్ వేర్‌హౌస్ సిస్టం అమలు చేసేందుకు రూపకల్పన చేస్తున్నారన్నారు. దీని ద్వారా రైతులకు సమయం వృథా కాకుండా డీజిటల్ సైన్ పొందిన వెంటనే బ్యాంకు రుణాలు త్వరగా పొందవచ్చు అన్నారు. 22.520 మెట్రిక్ టన్నులు నిలువ సామర్థ్యం గల తొమ్మిది గోడౌన్లు ఉన్నాయని తెలిపారు. 30శాతం రైతులకు రాయతీ 10శాతం లైసెన్స్ కలిగిన వ్యాపారులకు రాయితీ కల్పిస్తున్నామన్నారు. ప్రైవేటు గోడౌన్లలో దాచుకొని నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అశోక్ కుమార్ రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగులు తిప్పన్న, జాన్, కేడీసీఎంఎస్ సిబ్బంది శిరీష పాల్గొన్నారు

ప్రణాళికతో పదో తరగతి పరీక్షలు

● వంద శాతం ఉత్తీర్ణత కంటే నాణ్యమైన ఉత్తీర్ణత ముఖ్యం

● జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామూల్


4: మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి శ్యామూల్

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 2: మార్చి 18 నుంచి జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలు పక్కా ప్రణాళికతో జరుపుతామని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ అన్నారు. శనివారం ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో డివి జన్లోని పదో తరగతి చీఫ్ సూపరింటెండెంట్‌లకు, డిపార్మెంటల్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ముందుగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 162 పరీక్షా కేంద్రాలలో 36 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. అందుకు అన్ని ఏర్పాట్లను చేశామన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. మాస్ కాపీయింగ్‌కి అవకాశం లేకుండా పక్కాగా ఉత్తీర్ణత వచ్చేలా చూస్తామన్నారు. 100శాతం ఉత్తీర్ణత కంటే నాణ్యమైన ఉత్తీర్ణత ముఖ్యమన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు జరుగుతాయని, అరగంట ముందుగానే పరీక్ష హాల్లోకి అనుమతి ఇస్తామన్నారు. 300 మందికి పైగా అడిషనల్ డిపార్మెంటల్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 8,9 తేదీలలో ప్రశ్నాపత్రాలు పోలీస్ స్టేషన్‌లకు చేరుకుంటాయన్నారు. 35 పోలీస్ స్టేషన్లో ప్రశ్నాపత్రాలను భద్ర పరుస్తున్నామన్నారు. ఆరు సమస్యాత్మకమైన కేంద్రాలుగా గుర్తించమని వాటిలో సీసీ కెమెరాలు, బందో బస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎం మల్లికార్జున్ పాల్గొన్నారు.

● పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

పదో తరగతి పరీక్షల్లో చీఫ్ సూపరింటెండెంట్ డిపార్మెంటల్ ఆఫీసర్లు ఇన్విజిలేటర్లు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. విద్యార్థులకు ఓఎంఆర్ షీట్లు, జవాబు పత్రాలు సరిచూసుకొని జాగ్రత్తగా ఇన్విజిలేటర్ల సంతకాలు చేసి, రోల్ నెంబర్లు క్రాస్ చెక్ చేసుకోవాలన్నారు. 24 పేజీల జవాబు పత్రాన్ని ఇస్తామని అడిషనల్, జవాబు పత్రం విద్యార్థికి ఇవ్వడానికి ఆస్కారం లేదన్నారు.

వాహనం ఢీకొని బాలుడికి గాయాలు

మంత్రాలయం, మార్చి 2: మంత్రాలయం గుల్బర్గాకు చెందిన తుఫాన్ వాహనం ఢీకొని బాలునికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం శనివారం జరిగింది. ఎస్ఆర్ హోటల్ సమీపంలో బాలుని తల్లి పూలు అమ్ముతుండగా రఘు అనే ఎనిమిదేళ్ల బాలుడు ఆడుకుంటూ రోడ్డు దాటుతుండగా.. వాహనం ఢీకొట్టింది. దీంతో గాయాలు కావడంతో ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. బాలుని తల్లి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్, ఏఎస్ఐ ఆనందరెడ్డి తెలిపారు.

పది మంది గైర్హాజరు

దేవనకొండ ,మార్చి 2 : ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షలో పది మంది విద్యార్థులు గైహాజరైనట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్‌శర్మ తెలిపారు. 120 విద్యార్థులకు గాను 110 హాజరై పరీక్ష రాశారు.

కమిషనర్ సుడిగాలి పర్యటన


కంపోస్ట్ యార్డును పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్

ఆదోని టౌన్, మార్చి 2: మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రామచంద్రారెడ్డి శనివారం పట్టణంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను తెల్లవారు జామున పర్యవేక్షించారు. పట్టణ పొలిమేరలోని కంపోస్ట్ యార్డ్‌ను పరిశీలించి చెత్త సేకరణ తీరును పరిశీలించారు. సిరుగుప్ప రోడ్డులో నిర్మాణం పూర్తయిన టిడ్కో గృహ సముదాయాలను సందర్శించి అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో చేయాల్సిన అభివృద్ధి పనులను వెంటనే చేపడతామని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తామని కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు.

పాత పెన్షన్‌తోనే ఉద్యోగులకు భద్రత


ఓట్ ఫర్ ఓపీఎస్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 2: పాత పెన్షన్ విధానం అమలుతోనే ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాలకు భద్రత అని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు రామాంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని మదిరే గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓట్ ఫర్ ఓపీఎస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీ పోరాటంలో భాగంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నం యూటీఎఫ్ నాయకులు రంగనాయకులు, వెంకటలక్ష్మి, అరుణ జ్యోతి, ఈరన్న గౌడ్, జిక్రియా పర్వీన్, భాను, సుధాకర్ బాబు, రాము, శంకర్ నాయక్, ఈరన్న, యువరాజు పాల్గొన్నారు.

2ఏడీఎన్12: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున

రానున్నది టీడీపీ ప్రభుత్వమే

● రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున చౌదరి


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున

ఆలూరు, మార్చి 2: రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని ఎన్నికలు ఎప్పుడొచ్చినా చంద్రబాబును సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున అన్నారు. శనివారం ఆలూరులోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి అరాచక, నియంత పాలన సాగించాడన్నారు. ఎన్నికలకు సిద్ధం అంటూ జగన్ చెప్పుకుంటే టీడీపీ శ్రేణులు సైతం సంసిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఆలూరులో టీడీపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. మాజీ ఎంపీపీ బీమప్ప, టీడీపీ నాయకులు రవిచంద్ర, ఉమాపతి, గుర్రం అనిల్, అరికేర మల్లేష్, సుబ్బు, అరికేర మల్లప్ప సోమన్న, రామాంజినేయులు, కరెన్న పాల్గొన్నారు.

నిబంధనలతో ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 2: ఒకటో తరగతి చేరాలంటే ఆరేళ్ల వయస్సు ఉండాలని కేంద్రం తీసుకొచ్చిన నిబంధనలతో ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం అయిపోతుందని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సీ నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఎస్‌టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య నాయకుల సహావేశం జరిగింది. నూతన జాతీయ విద్యావిధానంలో వచ్చిన జీవో 117,172 మెమోలతో ప్రభుత్వ పాఠశాలల విద్యా వ్యవస్థ మరుగున పడి విద్యార్థులను పాఠశాల విద్యకు దూరం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, నాయకులు రామాంజనేయులు, సుధాకర్ బాబు పాల్గొన్నారు.

5న ఆలూరులో జాబ్‌మేళా

ఆలూరు, మార్చి 2: ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఈనెల 5న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సూరప్ప శనివారం తెలిపారు. ఐటీఐలో వివిధ కోర్సులలో చేసిన వారితో పాటు, ప్రస్తుతం ట్రైనింగ్ చేస్తున్న విద్యార్థులు కూడా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాన్ టెక్నికల్‌లో కూడా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. 18 నుంచి 29 సంవత్సరాల వయస్సు ఉన్న వారు బీటెక్, డిప్లమ, ఏదైన డిగ్రీ పాస్ అయిన నిరుద్యోగులు బాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు.

కారంపొడి తయారీ కేంద్రాలపై విజిలెన్స్ దాడులు

ఎమ్మిగనూరు, మార్చి 2: కలుగొట్ల గ్రామ సమీపంలో ఉన్న రెండు కారంపొడి తయారీ కేంద్రాలపై శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారుల దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ ఏఓ రూఫాస్ రోనాల్డ్, జీఎస్టీ అధికారి చక్రనాయ్, సిబ్బంది గ్రామ సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహ, ఉరుకుంద ఈరన్న కారం తయారీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. రెండు కేంద్రాల్లో దాదాపు రూ. 80లక్షల స్టాక్ ఉన్నట్లు గుర్తించారు. శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు టెస్టింగ్ కోసం పంపుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన పట్టణంలోని మార్కెట్ సర్కిల్‌లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసిన అధికారులు పదిరోజుల వ్యవధిలోనే కారం తయారీ కేంద్రల్లో తనిఖీలు చేయటంతో యజమానులు బెంబేలెత్తుతున్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కౌతాళం, మార్చి 2: ఉరుకుంద ఈరన్న స్వామి వారికి శనివారం రోజున భక్తులు దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష నగదును విరాళాలు అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, పాలక మండలి అధ్యక్షుడు నాగరాజుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి వారికి దేవాలయంలో నిర్మిస్తున్న రాజగోపుర నిర్మాణానికి కర్ణాటక రాష్ట్రం రాయచూరు పట్టణ గుజ్జర్ వివేక్, భవాని, గుజ్జర్ నారాయణరావు, లక్ష్మీబాయి కుటుంబ సభ్యులు రూ.1,00,101ల నగదును దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టి స్వామి వారి శేషావస్త్రాలు, ఫలపుష్పాలను అందజేశారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

● వంద లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

● కర్ణాటక మద్యంతోపాటు బొలేరో వాహనం సీజ్

మంత్రాలయం, మార్చి 2: మండలంలోని మాధవరం తండా నాటుసారా స్థావరాలపై మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఇందులో వంద లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఒక మహిళా విక్రేత పరారు కాగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదే విదంగా కర్ణాటక నుంచి 136 మద్యం టెట్రా ప్యాకెట్లును బొలేరో వాహనంలో తరలిస్తుండగా దుగ్గనూరు రవిని చెక్‌పోస్టు వద్ద అదుపులోకి తీసుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని బొలేరో వాహనం సీజ్ చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు. ఈ దాడు గురుమూర్తి, వీరేష్, వీరాంజనేయులు, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.